సాక్షి
కాకినాడ
బుధవారం | 14 | మే | 2025



రూ.2.20 లక్షల విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవనం నిర్మాణానికి దాడిశెట్టి విష్ణుచక్రం దంపతులు (తుని) రూ 2.20 లక్షల విరాళం సమర్పించారు.




ఇదేం ఆటంకం?

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో కొన్ని క్రీడలకు సంబంధించి, కొంత మంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

8లో

కడలిలోకి 1,869 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 1,869 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.45 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో 16న మాక్ డ్రిల్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకట్రావు

కాకినాడ సిటీ: భవనాలు కూలడం, అగ్ని ప్రమాదాల వంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే విషయంలో జిల్లా రక్షణ, సహాయ యంత్రాంగం సంసిద్ధతను పరిశీలించేందుకు ఈ నెల 16వ తేదీ ఉదయం కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని డీఆర్‌ఓ వెంకట్రావు తెలిపారు. తన చాంబర్‌లో మంగళవారం జరిగిన జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్స్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ సూచనల మేరకు శత్రు దాడులు, ఆకస్మికంగా భవనాలు కుప్పకూలడం, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పౌర రక్షణకు తక్షణం స్పందించేలా వివిధ శాఖల సమన్వయంతో డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (డీఈఓసీ) ఏర్పాటు చేశామని వివరించారు. రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్యం, రవాణా, పౌర సరఫరాలు, విద్యుత్, పశుసంవర్ధక, పంచాయతీ, విద్యా శాఖల సమన్వయంతో ఈ సెంటర్ పని చేస్తుందన్నారు. మాక్ డ్రిల్‌లో పరిశీలించిన అంశాల ఆధారంగా రక్షణ, సహాయ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని డీఆర్‌ఓ తెలిపారు. సమావేశంలో డీఈఓసీ నోడల్ అధికారి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీ డి.భారత్, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేష్, డీటీసీ కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు

కాకినాడ క్రైం: శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యాన పోలీసులు మంగళవారం లాడ్జీలు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. లాడ్జీల యాజమాన్యాలతో మాట్లాడి సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. చెక్ ఇన్ అయ్యే ప్రతి వ్యక్తి నుంచి నిర్దిష్ట ధ్రువపత్రం తీసుకోవాలన్నారు.

చిన్న ఉల్లికి.. పెద్ద దెబ్బ

- నిలిచిపోయిన గొల్లప్రోలు ఉల్లి సాగు
- దిగుమతులు, తెగుళ్లతో నష్టాలు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరవు



ఇప్పుడు ఈ ఉపాధి మాయం : గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉల్లి గ్రేడింగ్ చేస్తున్న మహిళలు (ఫైల్)



గొల్లప్రోలు చిన్న ఉల్లిపాయలు (ఫైల్)

పిఠాపురం: చాలా వరకూ కూరలు, టిఫిన్లు, చద్దన్నంలో ఉల్లి వాడకుండా ఉండలేరు. అందుకే అది నిత్యావసర సరకుగా మారింది. వాణిజ్య పంటల్లో దీనికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రపంచంలోనే పేరెన్నికగన్న పంటలు పండే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో ఆ పరిస్థితులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే గొల్లప్రోలు మండలంలో పండే పొట్టి మిర్చి మాయమైంది. అదే ప్రాంతంలో పండే దేశవాళీ నీరుల్లి (చిన్న ఉల్లి) కూడా అదే బాటలో ఉంది. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు పెద్దలు. కానీ అదే ఉల్లి.. దానిని సాగు చేస్తున్న రైతులకు మాత్రం నష్టాలనే మిగిల్చింది. ఫలితంగా దీని సాగు తగ్గిపోయి, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

5 వేల ఎకరాల నుంచి 20 ఎకరాలకు..

ఉల్లి సాగుకు గొల్లప్రోలు మండలం పెట్టింది పేరు. గతంలో ఏటా సుమారు 5 వేల ఎకరాల్లో 6 వేల మంది రైతులు ఉల్లి సాగు చేసేవారు. ఇక్కడ పండే ఉల్లిని సిరిపురం ఉల్లి అని పిలుస్తారు. ఎకరాకు 80 క్వింటాళ్ల నుంచి టన్ను వరకూ దిగుబడి వచ్చేది. ఏటా ఒక సీజన్‌కు సుమారు 5 వేల టన్నుల ఉల్లి దిగుబడులు వచ్చేవి. ఈ ప్రాంతంలో దేశవాళీ నీరుల్లి రకం ఎక్కువగా సాగు చేసేవారు. హైబ్రీడ్ ఉల్లి కంటే ఇది ఎక్కువ ఘాటుగా, రుచిగా ఉండేది. చిన్న సైజులో ఉండే ఈ ఉల్లికి మంచి గిరాకీ ఉండేది. పోషక విలువలు కూడా అధికంగా ఉండటంతో అనేక ప్రాంతాల ప్రజలు దీనిని ఎక్కువగా ఇష్టపడేవారు. అందుకే దీనికి చెప్పలేనంత డిమాండ్ ఉండేది. పైగా, ఇక్కడ పండించిన ఉల్లికి ఎక్కువ కాలం నిల్వ ఉండే గుణం ఉండటంతో ప్రతి ఒక్కరూ బస్తాల లెక్కన కొనుక్కుని ఇళ్లల్లో నిల్వ చేసుకుని, ఏడాదంతా వాడుకునేవారు. ఇంతటి పేరొందిన గొల్లప్రోలు ఉల్లి సాగు ప్రస్తుతం కేవలం 20 ఎకరాలకు పడిపోయిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష పైగా పెట్టుబడి అవుతూండగా.. రాబడి అంతకంటే తక్కువగా వస్తూండటంతో నష్టాల పాలైన రైతులు క్రమంగా ఉల్లి సాగుకు దూరమయ్యారు.

ఎగుమతుల్లేవ్.. దిగుమతులే..

ఒకప్పుడు గొల్లప్రోలు నుంచి ఉల్లిపాయలు జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. ముఖ్యంగా దుబాయ్ వంటి దేశాలకు ఎగుమతయ్యేది. సీజన్‌లో ప్రతి రోజూ వందల లారీలపై ఉల్లి ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం ఇక్కడ సాగు నిలిచిపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. అది కూడా హైబ్రీడ్ రకాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. మన రాష్ట్రంలోని కర్నూలుతో పాటు కర్ణాటకలోని బళ్లారి, మహారాష్ట్రలోని షోలాపూర్, పుణే వంటి ప్రాంతాల నుంచి ఇక్కడకు ఉల్లి దిగుమతి జరుగుతోంది.

ఉపాధికి గండి

అప్పట్లో ఉల్లి పంట రైతులకు కల్పతరువుగా ఉంటే వేలాది కుటుంబాలకు జీవనోపాధి కూడా కల్పించేది. సాగు ప్రారంభంలో నాట్ల నుంచి ఉల్లి తీత, కోత, రవాణా తదితర పనుల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 50 వేల కుటుంబాలు ఉపాధి పొందేవి. ముఖ్యంగా ఇళ్ల వద్ద మహిళలు ఎక్కువగా ఉపాధి పొందేవారు. ఉల్లి తవ్వి తీశాక కోతలు, గ్రేడింగ్ వంటి పనులన్నీ మహిళలే చేసేవారు. అటు ప్రభుత్వానికి కూడా రవాణా ద్వారా ఆదాయం సమకూరేది. అటువంటి ఉల్లి సాగు నిలిచిపోవడంతో వేలాది కుటుంబాల ఉపాధికి గండి పడింది. ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తే ఉల్లి సాగు పెరిగి ధరలు కూడా నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటూండటంతో ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అదే ఇక్కడి పంట అయితే, ధరలు తగ్గే అవకాశం ఉంటుంది.

లాభదాయకంగా లేక..



గతంలో ఉల్లి సాగు ద్వారా అధిక లాభాలు వచ్చేవి. కానీ, ఇతర ప్రాంతాల నుంచి ఉల్లి దిగుమతులు పెరిగిపోవడంతో ఇక్కడ పండిన పంటకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. దీనికి తోడు తెగుళ్లు విజృంభించడంతో పంటలు నాశనమై తీవ్ర నష్టాలు చూడాల్సి వచ్చింది. వీటన్నింటి ఫలితంగా ఉల్లి సాగు నిలిపివేయక తప్పలేదు. ఇక్కడ పండే దేశవాళీ నీరుల్లి రకం ఇతర ప్రాంతాల్లో ఎక్కడా దొరకదు. దీనికి మంచి డిమాండ్ ఉండేది. కానీ, ఎవ్వరూ పట్టించుకోకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తూండటంతో మంచి ఆరోగ్యకరమైన దేశవాళీ నీరుల్లి రకం ప్రస్తుతం లేకుండా పోయింది.

– ఎస్.రాంబాబు, ఉల్లి రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

దిగుమతులే దెబ్బ తీశాయి



ఒకప్పుడు గొల్లప్రోలు మండలంలో ఉన్నంత ఉల్లి సాగు దేశంలో ఎక్కడా ఉండేది కాదు. ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు వచ్చి ఇక్కడి ఉల్లి కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. అటువంటిది ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటూ, ఇక్కడి ఉల్లి పంటకు ధర లేకుండా చేసేశారు. దీనికితోడు వైరస్‌లు చుట్టుముట్టి పంటను నామరూపాలు లేకుండా చేసేశాయి. దీంతో ఇక్కడి రైతులు ఉల్లిసాగు నిలిపివేశారు. మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదు.

– ఎ.శ్రీను, ఉల్లి రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

సాగు తగ్గిపోయింది



గతంలో ఇక్కడ ఉల్లిసాగు చాలా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు బాగా తగ్గిపోయింది. ఉల్లి సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. వైరస్‌ల వల్ల ఉల్లి పంట దెబ్బ తినడంతో ఇతర పంటలు వేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. విత్తనాల కొనుగోలుపై హెక్టారుకు రూ.3 వేల వరకు రాయితీ ఇస్తున్నాం. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కేఎస్ శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

ఆగని టీడీపీ నాయకుల దుశ్చర్యలు



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు

గోకవరం: జగ్గంపేట, గోకవరం మండలాల సరిహద్దున ఉన్న సింగారమ్మ చింత ఆలయ అర్చకురాలు వట్టికూటి సీతామహాలక్ష్మి ఇంటిని మల్లిసాలకు చెందిన టీడీపీ నాయకులు గత నెలలో కూలగొట్టారు. అక్కడితో ఆగని వారు.. ఆ ఇంటి అవశేషాలకు సైతం నిప్పు పెట్టి బూడిద చేశారు. తాము మంగళవారం ఆలయం వద్దకు వచ్చేసరికి ఇంటికి సంబంధించిన కర్రలతో పాటు సామగ్రి మొత్తం బూడిదైందని బాధితులు వాపోయారు. తమను శాశ్వతంగా వెళ్లగొట్టేందుకే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ బాధితులతో కలిసి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు గోకవరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ సాయిప్రసాద్, ఎస్సై పవన్‌కుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్‌రావు మాట్లాడుతూ, సింగారమ్మ చింత అమ్మవారి ఆలయం వద్ద వంశపారంపర్యంగా అర్చకత్వాన్ని కొనసాగిస్తూ, అక్కడే చిన్నపాటి దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న సీతామహాలక్ష్మిపై మల్లిసాలకు చెందిన టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాత్రికి రాత్రే దుకాణాన్ని దౌర్జన్యంగా ధ్వంసం చేయడంతో పాటు సింగారమ్మ అమ్మవారి నగలు, ఇతర విలువైన వస్తువులు పట్టుకుపోయారన్నారు. ఈ దారుణంపై ఫిర్యాదు చేసినా పోలీసులు కనీసం స్పందించకపోవడం అత్యంత దారుణమన్నారు. ఇదే అలుసుగా తీసుకున్న టీడీపీ నాయకులు మళ్లీ రెచ్చిపోయారని, ఆలయం వద్ద కూల్చివేసిన పాకతో పాటు ఇతర సామగ్రికి నిప్పంటించారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా ఈ దారుణంపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని, లేకపోతే ఈ నెల 22వ తేదీ నుంచి గోకవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

ఏలేరు కాలువలో బాలుడి గల్లంతు



గల్లంతైన సత్యనారాయణ (ఫైల్)



బాలుడి తండ్రికి ధైర్యం చెబుతున్న ముద్రగడ గిరిబాబు



బాలుని కోసం కాలువ ఒడ్డున ఎదురు చూస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు: ఏలేరు కాలువలో ఓ బాలుడు గల్లంతైన సంఘటన ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నదమ్ములు పంది భవనేష్, వీర వెంకట సత్యనారాయణ (విఘ్నేష్), స్నేహితులు కాకినాడ సిరి, సూరాబత్తుల రాజా లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి ఉత్తీర్ణులయ్యారు. వీరందరూ గ్రామ శివారున ఉన్న ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి వెళ్లారు. భవనేష, రాజా గట్టున ఉండగా, సత్యనారాయణ (15), సిరి కాలువలో దిగారు. వడి ఎక్కువగా ఉండటంతో వారు కాలువలో మునిగిపోయారు. ఈత వచ్చిన భవనేష వారిని కాపాడేందుకు కాలువలో దిగి, నీటి వేగానికి భయపడి తిరిగి గట్టు మీదకు వచ్చేశాడు. కాలువలో మునిగిపోతున్న పిల్లలను గమనించిన స్థానిక రైతు సత్యనారాయణ, మరో యువకుడు సిద్ధూ చొరవ చేసి, సిరిని కాపాడారు. ఒడ్డుకు చేర్చి సపర్యలు చేసి, ఏలేశ్వరంలో ప్రథమ చికిత్స అనంతరం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాలువలో గల్లంతైన సత్యనారాయణ కోసం గ్రామస్తులు వలలతో రాత్రి వరకూ గాలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ ఏలేరు అధికారులతో సంప్రదించి, నీటి ఉధృతి తగ్గించాలని కోరారు. పెద్దిపాలెం గ్రామానికి చెందిన 8 మంది గజ ఈతగాళ్లను రప్పించారు. కార్లు, మోటారు సైకిళ్ల లైట్ల వెలుతుర్లో రాత్రి 8.30 గంటల వరకూ గాలించినా ఫలితం లేకపోయింది. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బుధవారం ఉదయం గాలింపు చేపడతామని సీఐ చెప్పారు. ఏలేరు కాలువ వద్ద ఉన్న గల్లంతైన బాలుడు సత్యనారాయణ తండ్రి రాంబాబుకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ధైర్యం చెప్పారు.

కనుల విందుగా.. విరుల పండుగ..

- ఘనంగా సత్యదేవుని శ్రీపుష్పయాగం
- భారీగా తరలి వచ్చిన భక్తులు



స్వామి, అమ్మవార్లకు ఊయలలో పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం: వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం రాత్రి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి శ్రీపుష్పయాగ మహోత్సవం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఒకవైపు నిండుగా అలంకరించిన సుగంధభరిత పుష్పమాలికలు.. మరోవైపు రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో మెరిసిపోతున్న కల్యాణ మండపంలో.. నూతన పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పమాలలు ధరించి వేదికపై కల్యాణ శోభతో ప్రకాశిస్తున్న స్వామి, అమ్మవార్ల శ్రీపుష్పయాగ మహోత్సవాన్ని వేలాది మంది భక్తులు దర్శించి, తన్మయత్వం చెందారు. పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా, నవదంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను కల్యాణ మండపానికి ఊరేగింపుగా రాత్రి ఏడు గంటలకు తీసుకువచ్చారు. వెండి సింహాసనంపై స్వామి అమ్మవార్లను, పక్కనే మరో ఆసనంపై సీతారాముల మూర్తులను ఉంచి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం గావించి, గర్భాదాన కార్యక్రమానికి సంబంధించిన పూజలు నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి, వేదాశీస్సులు అందజేసిన అనంతరం సర్వాంగసుందరంగా అలంకరించిన ఊయల మీద విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అలంకరణలో సత్యదేవుడు, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో పూజించారు. తొమ్మిది రకాల పిండి వంటలు నివేదించారు. పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊయలను మూడు పర్యాయాలు ఊపారు. ఊయల ఎదురుగా ఉంచిన అద్దంలో స్వామి, అమ్మవార్ల ప్రతిబింబాలను తిలకించి భక్తులు పులకించారు. తరువాత దంపత తాంబూలాలు, ప్రసాదాలు అందించారు. వైదిక కార్యక్రమాలను వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, దత్తాత్రేయశర్మ, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వైదిక కమిటీ సభ్యుడు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్ తదితరులు నిర్వహించారు. కార్యక్రమానికి వేలాదిగా వచ్చిన మహిళలకు జాకెట్టు ముక్కలు పంపిణీ చేశారు. శ్రీపుష్పయాగంతో సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.



కార్యక్రమానికి వచ్చిన మహిళలు, భక్తులు




కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్, ఈఓ దంపతులు



స్వామి, అమ్మవార్లకు నివేదించిన పిండివంటలు, ఫలాలు

ఇదేం ఆటంకం?



స్విమ్మింగ్ పూల్‌లో డీఎస్ఏ అధికారులు అతికించిన రుసుము వివరాలు

- డీఎస్ఏలో శిక్షణ పేరుతో దోపిడీ
- కొన్ని క్రీడల్లో అనధికార వసూళ్లు
- వెలవెలబోతున్న శిబిరాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రైవేట్ శిక్షణకు అనుమతులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వేసవి సెలవులను ఊరికే గడిపేయకుండా విద్యార్థులు తమకు నచ్చిన ఆటల్లో మెళుకువలు నేర్చుకుని ఉత్తమ క్రీడాకారులుగా తయారు కావడం కోసం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ... రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సహకారంతో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ శిబిరాలు మే ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 50 శిబిరాలు నిర్వహిస్తుండగా, కాకినాడ క్రీడామైదానం బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, క్రికెట్, జుడో, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, టెన్నిస్‌లో వేసవి శిక్షణ అందిస్తున్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో కోచ్‌లు లేని కారణంగా శిక్షణ ఇవ్వడం లేదు. సెలవుల్లో శిక్షణకు హాజరవుతున్న క్రీడాకారుల నుంచి కొన్ని క్రీడల్లో కోచ్‌లు అనధికారంగా డబ్బు వసూలు చేస్తూ డీఎస్ఏ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరి కొందరు వ్యక్తులకు డీఎస్ఏ అధికారులే స్వయంగా ప్రైవేటుగా శిక్షణ నిర్వహించుకునేందుకు అనుమతులు ఇస్తూ పరోక్షంగా వారిని ప్రోత్సహిస్తున్నారనే వాదన క్రీడా సంఘాల్లో వినిపిస్తోంది. వేసవి వచ్చిందంటే స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. డీఎస్ఏ ఆదాయ వనరుల్లో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ కీలకం. అయితే డీఎస్ఏ అధికారులు స్విమ్మింగ్ పూల్‌ను గతంలో ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. వారు నిర్వహించలేక డీఎస్ఏకు అప్పజెప్పారు. ప్రస్తుతం సిమ్మింగ్ పూల్ నిర్వహణ డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డీఎస్ఏ నిబంధనల ప్రకారం 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు రూ.1000, 15 సంవత్సరాలు దాటిన వారికి రూ.1,500 వసూలు చేయాలి. కానీ 14 సంవత్సరాల లోపు వారి నుంచి రూ.2,000, 15 సంవత్సరాల పైబడిన వారి నుంచి రూ.2,500 వసూలు చేస్తున్నారు. వేసవి క్రికెట్ శిక్షణకు రూ.3,000 వసూలు చేస్తున్నారు. టేబుల్ టెన్నిస్ కోచ్ లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో శిక్షణను నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో కోచ్ లేకపోవడంతో కొందరు ప్రైవేట్ వ్యక్తులు శిక్షణ అందిస్తూ డీఎస్ఏకు రూపాయి కట్టకుండా సొమ్ము చేసుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమై 13 రోజులు కావస్తున్నా ఏ క్రీడలో ఎంత మందికి శిక్షణ అందిస్తున్నారనే వివరాలు డీఎస్ఏలో లేక పోవడం గమనార్హం. ఏదిఏమైనా ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాల్లో ఆశించిన స్థాయిలో క్రీడాకారులు కానరావడం లేదు. ముఖ్యంగా బాలికలు చూపిన ఆసక్తి బాలురు చూపడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొందరు ఇదే అదనుగా అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని డీఎస్ఏను గాడిలో పెట్టాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై మంగళవారం డీఎస్ఏ ముఖ్యక్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్‌ను వివరణ కోరగా డీఎస్ఏ నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ వసూలు చేయడానికి వీలు లేదన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకుని, క్రీడాకారులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.


డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్


డీఎస్ఏలో స్విమ్మింగ్ శిక్షణ



డీఎస్ఏ ముఖ ద్వారం

మైనింగ్ స్క్వాడ్‌పై దాడి

అంబాజీపేట: సినీ ఫక్కీలో మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగిపై దాడి చేసి కంపెనీకి చెందిన కారును ఐదుగురు అపహరించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సుధాకర్ ఇంఫ్రాటెక్ కంపెనీకి జిల్లా స్పెషల్ మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగిగా ఊడిమూడి అనిల్ కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన అనిల్‌కుమార్‌తో పాటు తన తోటి ఉద్యోగులు చింతపల్లి ప్రవీణ్‌కుమార్, గూడూరి రూప్‌కాంత్‌లతో కలిసి మట్టి, ఇసుక వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో అంబాజీపేట హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నంబర్ లేని ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా ఆ వాహనాన్ని ఆపి బిల్లు చూపించమని అనిల్‌కుమార్ అడిగారు. దాంతో ట్రాక్టర్ డ్రైవర్ అతని ఓనర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో పి.గన్నవరానికి చెందిన మట్టపర్తి పండుతో పాటు మరో నలుగురు అక్కడకు వచ్చారు. అనిల్‌కుమార్‌తో పాటు వారి ఉద్యోగులతో ఘర్షణకు దిగారు. అనిల్‌కుమార్‌ను కొబ్బరి కమ్మలు, రాళ్లతో పండు, అతని వర్గీయులు దాడి చేసి గాయపరిచారు. అనంతరం ఇంఫ్రాటెక్ కంపెనీకి చెందిన వాహనాన్ని పండు, అతని వర్గీయులు తీసుకుపోయి ఆ వాహనంలో ఉన్న కంపెనీ బిల్లు పుస్తకాలు, రూ.1.30 లక్షల నగదును అపహరించారు. బాధితుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శతాధిక వృద్ధురాలు అల్లిమిల్లి చంటమ్మ(109) మంగళవారం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు ధర్మరాజు, అర్జునుడు, భీముడు, నకులుడుతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరితో పాటు 90 మంది మనుమలు, మునిమనుమలు ఉన్నారు. ఉదయం వరకు ఆరోగ్యంగా ఉన్న ఆమె టిఫిన్ చేసిన అనంతరం మరణించారు.


చంటమ్మ (ఫైల్)

ఇసుక లారీ ఢీకొని కౌలు రైతు మృతి

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరు గ్రామానికి చెందిన సూరెడ్డి రమణ (48)ను ఇసుక లారీ ఢీకొనడంతో మృతి చెందినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. మంగళవారం కౌలు రైతు అయిన సూరెడ్డి రమణ తుని రైతుబజారులో కూరగాయలు విక్రయించుకుని మోపెడ్‌పై స్వగ్రామానికి వస్తుండగా వెలంపేట వై.జంక్షన్‌లో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఇసుక లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రమణను తుని ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


మృతుడు రమణ (ఫైల్)

ఘరానా దొంగ అరెస్టు

బనశంకరి: బెంగళూరులో చోరీలకు పాల్పడుతున్న ఏపీలోని తూర్పు గోదావరికి చెందిన ఘరానా దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల నగరంలో కొడిగేహళ్లిలో ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకెళ్లారు. పోలీసులు గాలించి జేబీ నగరలో నివసించే గోదావరి వాసి కామేపల్లి శ్రీనివాస్ అలియాస్ కార్తీక్ (39)ను అరెస్ట్‌చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.9.20 లక్షల విలువచేసే 148 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గత నెల 16వ తేదీన చోరీ చేసిన తరువాత ఓ ప్రైవేటు హాస్టల్‌లో మకాం వేశాడు. పోలీసులు సీసీ కెమెరాల చిత్రాలు, ఇతర ఆధారాల ప్రకారం పట్టుకున్నారు. కార్తీక్‌కు దొంగతనాలే వృత్తి అని, బీదర్, హైదరాబాద్, సైబరాబాద్‌తో పాటు 10 పోలీస్ స్టేషన్లలో పాత నేరస్తుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. కార్తీక్, మోహన్‌రుద్ర అనే పేర్లతో తిరుగుతూ చోరీలకు పాల్పడేవాడు. ఇతడిపై ల్యాప్‌టాప్, ఇళ్లలో చోరీలతో పాటు 88 కి పైగా కేసులు ఉన్నట్లు చెప్పారు.

కుక్కలు, పందుల నివారణకు చర్యలు

మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహరావు

అమలాపురం టౌన్: మున్సిపల్ రీజనల్ పరిధిలోని నగరాలు, పట్టణాల్లో కుక్కలు, పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజమహేంద్రవరం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) సీహెచ్ నాగ నరసింహరావు స్పష్టం చేశారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే ఏర్పాట్లు చేశామని ఆర్డీ చెప్పారు. ఇందు కోసం ప్రతి మున్సిపాలిటీలో కుక్కల కుటుంబ నియంత్రణ కోసం ఆపరేషన్ కేంద్రాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అమలాపురం మున్సిపాలిటీలో రూ.15 లక్షలతో కుక్కల ఆపరేషన్ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీ మున్సిపాలిటీలో పందులను నివారించే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పట్టణాల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పన్నుల వసూళ్లు నూరు శాతం జరిగేలా రెవెన్యూ విభాగాలు నిమగ్నం కావాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీటి సరాఫరా విభాగాలపై ఆయన చర్చించారు. తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అమలాపురం కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, మండపేట కమిషనర్ టీవీ రంగారావు, కొవ్వూరు కమిషనర్ నాగేంద్రకుమార్, నిడదవోలు కమిషనర్ కృష్ణవేణి, రామచంద్రపురం డీఈఈ శ్రీకాంత్, ముమ్మిడివరం కమిషనర్ వర్మతో పాటు అధికారులు పాల్గొన్నారు.

కుక్కల ఆపరేషన్ కేంద్ర భవన నిర్మాణం పరిశీలన: స్థానిక 27వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మితమవుతున్న కుక్కల ఆపరేషన్ కేంద్ర భవనాన్ని ఆర్డీ నాగ నరసింహరావు పరిశీలించారు. సమీక్షా సమావేశం అనంతరం పట్టణంలో ఆయన పర్యటించి పలు విభాగాలను సందర్శించారు. డ్రెయిన్లతో పూడిక తీయాల్సిన డీఈఈ నాగ సతీష్‌తో ఆర్డీ చర్చించారు.


కమిషనర్లతో సమీక్షిస్తున్న రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహరావు

పెనకనమెట్ట సావరంలో చోరీ

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలంలోని పెనకనమెట్ట సావరంలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొవ్వూరు రూరల్ సీఐ బి.విజయబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు, వారి కుటుంబ సభ్యుల తో పాటు ఈ నెల 11వ తేదీన పందలపర్రులో బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లారు. 12వ తేదీ ఉదయం తిరిగి వచ్చి చూసుకుని సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దుండగులు ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి సుమారు 8 కాసుల బంగారు వస్తువులను, రూ.8 లక్షల నగదు, 250 గ్రాముల బరువు గల వెండి వస్తువులను దొంగిలించినట్టుగా తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి డీఎస్పీ కేవీ సత్యనారాయణ, క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ స్వరూప్, సీఐ శ్రీధర్ తదితరులు పరిశీలించి, వివరాలు సేకరించారు.


చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న సీఐ విజయబాబు

పక్కింటికి భోజనానికి వెళ్లి వచ్చేలోగా దోచేశారు

రాజానగరం: ఇంటి తలుపులకు గడియపెట్టి, పక్కింటికి వెళ్లి భోజనం చేసి వచ్చేలోగానే ఇంట్లో దాచుకున్న బంగారు నగలను దుండగులు అపహరించుకుపోయారు. మండలంలోని వెలుగుబందలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. జాలెం గోపీరత్నం పక్కింటి వారి ఆహ్వానంపై భోజనం చేసి వచ్చేందుకు ఇంటి తలుపులకు గడియపెట్టి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఆ తలుపులు తెరచివుండటంతో కంగారుగా లోనికి వెళ్లి చూస్తే ఇంట్లో దాచుకున్న నాలుగు కాసుల బంగారు నగలు కనిపించలేదు. వెంటనే రాజానగరం వచ్చి, జరిగిన చోరీ గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తుని: రైలు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై జీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..తుని-హంసవరం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి 20 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు మృతి చెందాడు. మృతుడు నలుపురంగు ట్రాక్ ధరించి ఉన్నాడు. చేతిపై శ్రావణి అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి దగ్గర ఇతర ఏ ఆధారాలూ లభించలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించవచ్చన్నారు.


యువకుడి మృతదేహం

ఏలూరులో కలవచర్ల మహిళ...

రాజానగరం: భర్తతో కోపంతో పుట్టింటికి వెళ్లిన మహిళ ఊహించని ప్రమాదానికి గురై అందరికీ దూరమైంది. తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్న మండలంలోని కలవచర్లకు చెందిన బొమ్మోతు కుమారి (40) ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోవడంతో మృతిచెందింది. ఏలూరు రైల్వే స్టేషను సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలంలోని ముక్కినాడకు చెందిన కుమారికి కలవచర్లకు చెందిన ఏసుతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కాగా, కుమార్తెకు వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబ పరంగా భార్యాభర్తల నడుమ ఏర్పడిన గొడవలతో కుమారి కోపంతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఆమె తల్లిదండ్రులు మండెల సత్యనారాయణ, పాపలు పనుల కోసం హైదరాబాద్‌కి పయనమవడంతో వారితోపాటు తాను కూడా గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరింది. డోరులో నిలబడివున్న ఆమె ఏలూరు సమీపంలోకి వచ్చే సరికి ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమెను రైల్వే పోలీసులు ఏలూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె భర్త ఏసు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి, మృతురాలిని తన భార్యగా నిర్ధారించాడు. కేసును ఏలూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో శ్రీప్రకాష్ ప్రతిభ


జి.సాయి అనీష్


ధాత్రి నిహారిక


పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు, వరుసగా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సీబీఎస్‌ఈ పదవ తరగతి, ప్లస్‌టూ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్ మంగళవారం తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో ఎన్.సత్యసాయి 483, ఎం.యశస్వి 482, పి.తరుణ్‌కుమార్ 481, మహర్షి4 79, ఎస్.రఘువందన 478మార్కులు సాధించారన్నారు. ప్లస్‌టూ ఫలితాల్లో జి.సాయి అనీష్ 469, ధాత్రి నిహారిక 466 సాధించి ప్రతిభ చాటారన్నారు. మ్యాథ్స్, సైన్స్, సబ్జెక్టుల నుంచి నూటికి నూరుశాతం మార్కులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కార్యదర్శి నరసింహారావు, అధ్యాపకులు అభినందించారు.